క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు విశేషంగా నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ అలంకరించారు. హరనామస్మరణలో భక్తులు మునిగితేలారు.

ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలోని బొద్ద పువాని చెరువులో ఉపాధి పనులు చేపట్టడానికి రూ.9.5లక్షలు మంజూరయ్యాయని సర్పంచ్ వెన్నల అప్పారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం పూడిక తీత పనులను సర్పంచ్ అప్పారావు ప్రారంభించారు. పనుల్లో 110 కూలీలు ఉపాధి పొందుతున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, వార్డు సభ్యులు వెన్నల శశి, పైల సత్యనారాయణ, వీఆర్పీ గంగునాయుడు పాల్గొన్నారు.

లోకోస్ అప్లికేషన్‌పై శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీవీ రమణ

సింహాచలం: పెందుర్తి మహిళా సమాఖ్య కార్యాలయంలో లోకోస్ అప్లికేషన్‌పై వీవోఏలకు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఏపీఎం బీవీ రమణ మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే శిక్షణ తరగతుల్లో సెర్ప్ సంస్థ ద్వారా అన్ని ఎస్‌హెచ్‌జీలు, వీవోలు, మండల సమాఖ్యల సమాచారం, లావాదేవీలు, డిజిటలైజేషన్ చేయడం ద్వారా దేశమంతా ఒకే విధమైన వ్యవస్థ ఉంటుందన్నారు. తద్వారా సమాచారం తక్కువ సమయంలో తెలుసుకునే విధానం అభివృద్ధిచేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీవోటీ సభ్యులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



కాంట్రాక్టర్, యాజమాన్యం ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందారు. కార్మిక సంఘాల సమాచారం మేరకు వివరాలివి. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్‌లో శనివారం ఉదయం ఎత్తు నుంచి పడిన ఘటనలో నడుపూరుకు చెందిన కె. కృపావరం (50) తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. చర్చల అనంతరం కంపెనీ నష్టపరిహారంతో సంబంధం లేకుండా రూ.3 లక్షలు చెల్లించడానికి, కుటుంబీలకు తాత్కాలిక ఉపాధి కల్పించడానికి అంగీకరించారు. చర్చల్లో విభాగాధిపతి డే, ఏజీఎం శ్రీనివాసరావు, పర్సనల్ అధికారి రాజేశ్వరరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, నందికి తాతారావు, నాగరాజు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంట్లో వెలుగు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- వెన్నలపాలెంలో ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వెన్నలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. బీసీ కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేశామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రతి చిన్న సమస్య కోసం ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా చేశామన్నారు. గ్రామీణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే అజెండాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జగనన్న పాలన పట్ల ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు పూర్తి కాలం కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఎమ్మెల్యే అదీప్ రాజ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజేయ్‌రాజ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భగవాన్ జయరామ్, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, ఎంపీటీసీ వి.అరుణకుమారి, జేసీఎస్ కన్వీనరు వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ వి.ప్రకాశరావు, అధికారులు పద్మజ, చంద్రావతి, సునీత, షణ్ముఖ, రెడ్డి, రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ఇండోర్‌స్టేడియంకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సోమవారం పరిశీలించారు. కేటాయించిన భూమికి హద్దులు నిర్ణయించి అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



బావి నుంచి బయటకు తీసిన మృతదేహం



పురుషోత్తమ రాజు(ఫైల్)

పరవాడ: అనకాపల్లి–గాజువాక జాతీయ రహదారిలో మారేడుపూడి సమీపంలో బావిలో పడి ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పరవాడ ఎస్‌ఐ టి.తేజశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాక మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన పి.పురుషోత్తమరాజు(26) అనే యువకుడు స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టర్ వద్ద లేబర్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వచ్చిన పురుషోత్తమరాజు రాత్రి ఇంటికి చేరకపోవడంతో ఆయన తమ్ముడు ఫోన్ చేశాడు. పురుషోత్తమరాజు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. సోమవారం ఉదయం మళ్లీ ఫోన్ చేయడంతో మారేడుపూడి సమీపంలో బావి వద్దకు కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం వచ్చిన స్థానికులు బావి వద్ద ఉన్న ఫోన్ లిఫ్ట్ చేసి బావిలో గుర్తుతెలియని మృతదేహం ఉందని తెలిపారు. దీంతో బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని పురుషోత్తమరాజు మృతి చెందినట్టు గుర్తించారు. పురుషోత్తమరాజుకు ఆన్‌లైన్ గేమ్ ఆడే అలవాటు ఉందని, అందులో నష్టపోవడం వల్లే ప్రాణాలు తీసుకొని ఉంటాడని భావిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తేజేశ్వరరావు చెప్పారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు

- హాల్ టికెట్‌లో తప్పులు ఉన్నా తగిన ప్రూఫ్ చూపెడితే అనుమతి
- పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ వెల్లడి



పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం: ఈనెల 10న జరిగే పాలిసెట్–2023 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఆరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 10 గంటలకు ఎగ్జామ్ హాల్‌కు చేరుకోవాలని తెలియజేశారు. హాల్‌టికెట్లలోఎలాంటి తప్పులు ఉన్నా అభ్యర్థులు సరైన గుర్తింపుకార్డు చూపిస్తే పరీక్షకు అనుమతించడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డ్, స్కూల్ ఐడీ, విద్యార్థి సెల్ఫ్ డిక్లరేషన్, ఐడీ ప్రూఫ్ డాక్యుమెంట్లు తమ వెంట తీసుకు రావాలని సూచించారు. పత్రాలు పరిశీలించి పరీక్షకు అనుమతించడం జరుగుతుందన్నారు.

సంకీర్తన పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య సంకీర్తన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. అన్నమాచార్య 615వ జయంతిని పురస్కరించుకుని శృతిలయ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో బహుమతుల ప్రదానోత్సవాన్ని సింహాచలం దేవస్థానం పురోహితుడు కరి సీతారామాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలతో వేంకటేశ్వరస్వామి వారి పరిపూర్ణ కటాక్షం లభిస్తుందన్నారు. ముఖ్య అతిథి ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే భక్తిని అలవర్చుకోవాలన్నారు. సంగీత కళలో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించే దిశగా అన్నమాచార్య జయంతిని నిర్వహించిన శృతిలయ సంస్థ ప్రతినిధులను అభినందించారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలు వీరే..

సబ్ జూనియర్స్ విభాగంలో రితిక మహాదేవ్, ఇంద్ర మహిత్, ఆకాంక్షవల్లి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. జూనియర్స్ విభాగంలో హరిణి, నిరత్వయ, సాయి శ్రావణి.. సీనియర్స్ విభాగంలో పి.శారద, నాగలక్ష్మి, లక్ష్మీప్రియాంక మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న భెల్ (హెచ్‌పీవీపీ) జీఎం ఇన్‌చార్జి జితేంద్రరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: క్రీడలతో మానసిక ఒత్తిడి తొలగి, నూతన ఉత్తేజం కలుగుతుందని భెల్ (హెచ్‌పీవీపీ) జీఎం ఇన్‌చార్జి జితేంద్రరెడ్డి అన్నారు. సంస్థ విశాఖపట్నం యూనిట్‌లో యువ కార్మికులు, ఉద్యోగులతో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగుల్లో ఐక్యతతో పాటు వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీస్తాయన్నారు. సంస్థకు చెందిన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంస్థ క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో క్రికెట్‌లో 5 టీములు, వాలీబాల్‌లో 4 టీములు పాల్గొన్నాయి. పాలకవర్గం ప్రతినిధుల సమన్వయంతో సింహాద్రి కమ్యూనిటీ సెంటర్ సహకారంతో నిర్వహించిన పోటీల్లో విజేతలైన టీములకు జీఎం ఇన్‌చార్జి జితేంద్రరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం ప్రొడక్షన్ హెడ్ కండపాల్, హెచ్‌ఆర్ హెడ్ ఎంవీఎస్ రాజు, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సంస్థ యూనియన్ ప్రతినిధులు కె.దేముడు, పడాల రమణ, ఎస్.సాహు, అల్లం వెంకటరావు, పీవీఎన్ రాజు, ఆర్.అప్పారావు, ఎ.నర్సింగరావు, ప్రవీణ్, మనోజ్ నాయక్, వీరబాబు, బాషా, అపురూప్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



గోల్డ్ మెడల్ విజేత మెహరున్నీసాను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ క్రీడా పోటీల్లో ఏయూ మెరైన్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థిని ఎం.డి.మెహరున్నీసా బేగం బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా సోమవారం వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో మెహరున్నీసాను సత్కరించి అభినందించారు. బాక్సింగ్ క్రీడలో 52–54 కేజీల విభాగంలో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మెహరున్నీసా గోల్డ్ మెడల్ సాధించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలి నడకన విధులకు మేయర్



కాలినడకన కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సు ద్వారా సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టిక్కెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి, అక్కడి నుంచి కాలినడకన జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ప్రైవేట్ వాహనాలపై రావాలని మేయర్ ఆదేశించారు.

కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ: కబడ్డీ క్రీడకు సీతానగరం పెట్టింది పేరని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గత 40 సంవత్సరాలుగా ఎస్‌ఆర్‌వైఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారని చెప్పారు. దుర్గమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఎస్‌ఆర్‌వైఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18 వరకూ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పోటీల పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ మొల్లి చిన్న పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, బీజేపీ నేత కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్ చందు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏయూ విద్యార్థికి స్థానం



విద్యార్థిని అభినందిస్తున్న విభాగాధిపతి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సరం విద్యార్థి ఐ.రాణాప్రతాప్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య సంబరాల్లో భాగంగా శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని 'అమ్మ నా మాతృ భాష' కవితను రాణాప్రతాప్ వినిపించారు. అతడికి జాతీయ సాహిత్య పురస్కారం, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు కవి శ్రేష్ఠ బిరుదును ప్రదానం చేశారు. అతడిని తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు సోమవారం అభినందించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉభయదాతలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. అర్చకులు ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదు

- డ్రైవర్ చాకచక్యం వల్ల ప్రమాదం తప్పింది
- సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్

సింహాచలం: ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి వెళ్లే వారికి సురక్షితమైన ప్రయాణం అందిస్తున్నామని సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. సింహాచలం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు మాత్రమే సింహగిరికి పలు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటాయని చెప్పారు. ఆ బస్సులన్నింటినీ ముందుగా పరిశీలించి ఫిట్ ఫర్ ఘాట్‌కు అనుకూలమైతేనే నడపడం జరుగుతుందని పేర్కొన్నారు. గడిచిన ఆదివారం సింహగిరికి వెళ్తున్న బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదని స్పష్టం చేశారు. టోల్‌గేట్ దాటిన తర్వాత వచ్చే ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎగువకు ఎక్కుతున్న సమయంలో బస్సుకు కారు అడ్డుగా వచ్చిందన్నారు.ఈ లోగా బస్సుకు కారు మధ్యలోకి ద్విచక్ర వాహనదారుడు కూడా వచ్చేయడంతో డ్రైవర్ సమయ స్ఫూర్తితో కుడి వైపు తిప్పాడన్నారు. ఈ తరుణంలో బస్సు ఎదురు భాగం దెబ్బ తిందన్నారు. ఆ తర్వాత చాకచక్యంగా వ్యవహరించి బస్సులో ఉన్న ప్రయాణికులకు ప్రమాదం జరగకుండా చూశాడన్నారు. వెనక్కి వెళ్లిన బస్సు రైలింగ్‌ను ఢీకొని నిలిచిందని తెలిపారు. ఈ సంఘటనలో బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదని తెలియజేశారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి చర్యలు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సబ్బవరం: వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు తెలిపారు. వేసవి సెలవుల్లో మేము చదవడాన్ని ఇష్టపడతాం అనే కార్యక్రమాన్ని అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో వచ్చే నెల 10 వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు సోమవారం తెలిపారు. పాఠశాల విద్యార్థులను బృందాలుగా విభజించి ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలన్నారు. వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి రోజువారీగా కథలు పోస్ట్ చేస్తున్నారన్నారు. ఆ కథలు చదివాక విద్యార్థుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు సెలవుల్లో సమ్మర్ క్యాంప్ మాడ్యువల్ కూడా అందజేసినట్టు చెప్పారు.

వేసి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఎంఈవో అప్పలరాజు



వుయ్ లవ్ రీడింగ్ సూక్తులు, చిత్రాలతో విద్యార్థులు

సింహాచలం: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం సూచించారు. అడవివరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. 35రోజులపాటు నిర్వహించే శిబిరంలో విజ్ఞానవంతులైన వారిచే పలు అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు మాట్లాడుతూ అద్భుతమైన రచనలు చేసిన వారి పుస్తకాలు గ్రంథాలయంలో లభిస్తాయని, సెల్‌ఫోన్‌లు వాడకుండా ప్రతీ ఒక్కరూ వాటిని చదవాల సూచించారు. ఈ సందర్భంగా వుయ్ లవ్ రీడింగ్ ప్రాధాన్యత తెలియజేస్తూ సూక్తులతో కూడిన చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహం, గ్రంథాలయ రీడర్స్ కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, వాణీ విద్యా విహార్ కరస్పాండెంట్ అపర్ణ, అడ్వకేట్ రామకష్ణ, అప్పలనర్సయ్య, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం: పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు అన్నారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. విద్యార్థులంతా వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 11వ తేదీ వరకూ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు వంగలి సైన్స్ టీచర్ పాణి, గ్రంథాలయ అధికారి వి. కుమారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

దళిత అధికారులపై వేధింపులు తగవు



మాట్లాడుతున్న భీమ్‌సేన ప్రధాన కార్యదర్శి రవిసిద్ధార్థ

సీతంపేట: దళిత అధికారులపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని భీమ్‌సేన ప్రధాన కార్యదర్శి రవి సిద్ధార్థ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా రాష్ట్రంలో దళిత అధికారులు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఆత్మగౌరవంతో విధులు నిర్వహిస్తున్న అధికారులు దళితులైతే వారిపై అనేక అసత్య ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో డాక్టర్ అచ్చెన్న హత్య నుంచి జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రాజాబాబు వరకు అనేక మంది అట్రాసిటీకి గురయ్యారని చెప్పారు. జీ20 సదస్సు విజయవంతంగా నిర్వహించి ప్రపంచ దేశాల ప్రతినిధులచే మన్ననలు పొందినప్పటికీ రాజాబాబుపై అసత్య ఆరోపణలు చేయడానికి ప్రధాన కారణం దళితుడు కావడమే అన్నారు. జీవీఎంసీలో సూపరెంటెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అధికారి దళితుడు అవ్వడం వల్ల ఆయనపై అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం జరుగుతోందన్నారు. విశాఖ రైల్వే ఆస్పత్రిలో పనిచేస్తున్న దళిత డాక్టర్‌పై అక్కడున్న సహచర ఆధిపత్య కులాల డాక్టర్లు దాడులు చేశారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలపై ప్రభుత్వాలు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో భీమ్‌సేన ప్రతినిధులు ఓంకార్, జగదీష్, శ్రీకాంత్, జైకుమార్, రావణ్, రాము, శ్రీను, సర్వేశ్వరరావు, అప్పలరాజు, ఉత్తరాంధ్రా దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.